



## శ్రీపతి కథా స్పెషల్

# శ్రీ శ్రీ to శ్రీరామ్

'ఆకాశవాణి న్యూఢిల్లీ కేంద్రం. వార్తలు చదువుతున్నది పుల్లట చలపతిరావు..' అనే మంద్రమైన గొంతునెప్పుడైనా విన్నారా? ఆయనే కథకుడు శ్రీపతి. విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక కార్యవర్గ సభ్యుడిగా తొలి నాలుగయిదేళ్ల క్రియాశీలక పాత్ర పోషించిన శ్రీపతి 'సృజన' పత్రికతో సాహితీ మిత్రునిగా చిరపరిచితులు. 'ఎల్లోరాలో వాళ్లు ముగ్గురు' 'సత్యజిత్‌రాయ్ ఎవరు' 'బెనారస్ చిత్రాలు' కథా సంపుటాలతో సుప్రసిద్ధులయిన కథకుడు శ్రీపతి ఇంటర్వ్యూ ఈ వారం...



నాడు మహాకవి శ్రీశ్రీతో...

## మీ చిన్ననాటి సంగతులు చెప్పండి..

– మా స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలోని భైరిపురం. నేను 1938లో జులై 13న పుట్టాను. మా అమ్మ అమ్మన్నమ్మ, నాన్న రామన్ననాయుడు. ఆయన మునసబు (గ్రామాధికారి)గా ఉండేవాడు. నాకు రెండేళ్ల వయసులోనే మా అమ్మ చనిపోయింది. అప్పట్నుంచి కొన్ని నెలల పాటు మా పెదనానమ్మ పెంచింది. తర్వాత పిన్ని వరసయ్యే ఆమె నా ఐదో ఏటి వరకూ పెంచింది. బడికెళ్లేక తోటి పిల్లలందరికీ అమ్మ ఉంటే నాకెందుకు లేదనిపించేది. చాలా దిగులుగా ఉండేది. సంక్రాంతి రోజుల్లో ఉత్తరాంధ్ర గ్రామీణులు పెద్దల పండగ అని చేస్తారు. ఇంట్లో చనిపోయినవారి పేరు మీద కొత్తబట్టలూ పిండివంటలూ దేవుడికి పెడతారు. ఆ రోజు పెద్దలొస్తారని నమ్మకం. దానికన్ని ఏర్పాట్లూ జరుగుతూ ఉన్నప్పుడు నేను మా అమ్మ నిజంగానే వస్తుందనుకునేవాణ్ని. అమ్మ ఎప్పుడొస్తుందో చెప్పమంటూ మా తాతను విసిగించేవాణ్ని. ఎంతకూ రావటం లేదని ఏడ్చిఏడ్చి నిద్రపోయేవాణ్ని. లేచి మళ్లీ అడిగితే వచ్చి వెళ్లిపోయిందనేవారు. ఎంత బాధపడేవాడినో. అందుకే నా కథల్లో అది ప్రతిఫలించేలా రాశాను.

## మీ చదువు గురించి చెప్పండి?


ఐదేళ్లు నిండాక బళ్లో వేసి చదివించాలని మా నాన్న మళ్లీ నన్ను మా ఊరు తీస్కెళ్లిపోయారు. అప్పటిదాకా బడి అంటే వీధి బడే. పద్యాలు, శతకాలు, ఎక్కాలు అన్నీ నేర్పించేవారు. మా నాన్న నాకోసం ప్రత్యేకంగా ఓ ఉపాధ్యాయుణ్ణి పెట్టి, బడిలాగా ఏర్పాటు చేశారు. అతనేవో కారణాల వల్ల వెళ్లిపోతే రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న జవానొకతన్ని తీసుకొచ్చి మళ్లీ పెట్టారు. అలా నేను ఐదో తరగతిలో ఇచ్ఛాపురంలో స్కూల్లో చేరాను. చిన్నప్పట్నుంచీ తెలుగంటే అభిమానం కాస్త ఎక్కువగానే ఉండేది. దానికి కారణాలు అనేకం. మా పెదనాన్న పురాణ కాలక్షేపం చేసేవారు. భారతం చదివి అర్థం చెబుతున్నప్పుడు గ్రామస్తులతోపాటూ నేనూ వినేవాణ్ణి. మా ఊళ్లో భాగవతాలు, యక్షగానాలు ఆడేవారు. మాది ఒరిస్సా శివారు ప్రాంతం కావటంతో అక్కడినుంచి కొంతమంది గురువులు వచ్చి మా ఊరివాళ్లకు మృదంగం, హార్మోనియం వంటివి నేర్పేవారు. ఊళ్లో భజనలు జోరుగా జరుగుతూ ఉండేవి. శివరాత్రి, శ్రీరామనవమి వంటి పర్వదినాల్లో తోలుబొమ్మలాటలు వంటివి జరిగేవి. మొత్తమ్మీద మనసుని తట్టిలేపే ఒక సాంస్కృతిక వాతావరణం ఉండేది. ఆ ప్రభావం నామీద చాలా ఉంది.

## కథలు రాయాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

ఇచ్ఛాపురం సురంగి హైస్కూల్లో చదువుతున్నప్పుడు యడవల్లి వెంకట సూర్యనారాయణ అనే ఉపాధ్యాయుడు ఉండేవారు. నేను పదకొండో తరగతిలో ఉండగా ఆయన టాల్‌స్టాయ్ కథ 'వేర్ లవ్ ఈజ్ దేర్ గాడ్ ఈజ్' అనే దాన్ని అద్భుతంగా బోధించారు. అది నన్ను ఆకట్టుకుంది. ఆ ప్రభావంతోనేమో నేను ఆ వేసవి సెలవుల్లో ఓ కథ రాశాను. మా సవతి చెల్లి వనజాక్షి చిన్నతనంలో క్షణమైనా నన్నొదలకుండా తిరుగుతుండేది. ఓ రోజు ఆ పిల్ల నాతోపాటూ తోటకొస్తానని అల్లరి చేసింది. అంత దూరం నడవలేదని నేనొద్దన్నాను. ఏదో మాయ మాటలు చెప్పి మరోతోవన నేను వెళ్లిపోయాను. ఇంటికొచ్చేసరికి ఏదో విషప్పురుగు కుట్టి ఆమె పరిస్థితి తీవ్రంగా ఉంది.. ఇంటి ముందు చాలామంది పోగయ్యారు. తర్వాత కోలుకుందనుకోండి. ఆ పరిస్థితిని వర్ణిస్తూ కథ రాశాను. అది అముద్రితం, ఇప్పుడు అలభ్యం.

## కాలేజీ రోజులు కులాసాగా గడిచాయా?

విశాఖపట్నం ఏవీఎన్ కాలేజీలో ఇంటర్ రెండో ఏడాదిలో చేరాను. వైజాగ్ నన్ను పూర్తిగా మార్చేసింది. అంతకుముందు మేం సినిమా చూడాలంటే బరంపురం వెళ్లాల్సి వచ్చేది. ఇక్కడ బోలెడన్ని సినిమాహాళ్లు. సినిమాలు, స్నేహితులు, కమ్యూనిస్టులు, రకరకాల విషయాల మీద చర్చలు.. వీటితో నేను పూర్తిగా మారిపోయాను. పుస్తకాలు బాగా చదవడం ప్రారంభించాను. ఇంగ్లిష్ సాహిత్యం, శరత్, టాగోర్ రచనలూ బాగా చదివేవాణ్ణి. వీటిని చదవడానికి డబ్బు ఖర్చయ్యేది. ఇద్దరు మనుషులకి కేరేజీ భోజనం రెండు పూటలకీ కలిపి నెలకి 21 రూపాయలయ్యేది. మొత్తమ్మీద నా నెలఖర్చు 55 – 57 రూపాయలయ్యేది. ఈ పుస్తకాల వల్ల నా ఖర్చు పెరిగి వందకు చేరింది. భరించడం తనవల్లకాదని మా నాన్న చేతులెత్తేశారు. ఈలోగా క్లాసు పుస్తకాలు చదవడం మానెయ్యడంతో నేను ఫెయిలయ్యాను. శ్రీశ్రీ మహాప్రస్థానం, ప్రతాపరుద్రీయం.. వంటివన్నీ నేను చదివింది అప్పుడే. లెక్చరర్ దివాకర్ల రామ్మూర్తి ప్రోత్సాహంతో ఇంకా చదివేవాణ్ణి. అలా చలం రచనలు చదవటం, ఆయనకు ఉత్తరాలు రాయటం చేసేవాణ్ణి. నా అభిమాన రచయిత గుడిపాటి వెంకటచలం. ఆయన నా జీవితాన్ని మార్చేయడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. అందుకే ఆయన శతజయంతి ఉత్సవాల్ని ఢిల్లీలో



నేడు తన ఆధ్యాత్మిక గురువు శ్రీరామ్‌తో..

నేను దగ్గరుండి జరిపించాను.

**అచ్చయిన తొలి కథ...తర్వాతి వివరాలు చెప్పండి.**

నా తొలికథ 'సహృదయ' 1956 నవంబర్‌లో అప్పట్లో బెంగుళూరు నుంచి వెలువడే 'ప్రజామత' వారపత్రికలో 'శ్రీపతి' పేరుతో అచ్చయ్యింది. అది మొదలు తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, భారతి, యువ, జ్యోతి, ప్రజాప్రభ, కవిత, స్వాతి, ఈనాడు, స్రవంతి, ఇండియాటుడే వంటి పత్రికల్లో దాదాపు అరవై కథలు అచ్చయ్యాయి. తొలి కథా సంపుటి 'మంచు పల్లకి – మరి తొమ్మిది' జులై 1968లో ఎమెస్కో పాకెట్ బుక్స్ ప్రచురణగా వెలువడింది. తొలి కథా సంపుటం చలం గారికి భక్తితో అంకితమిచ్చాను. కథలు పుస్తకాలుగా తీసుకురావాలనే శ్రద్ధ నాకు ఉండేది కాదు. అందుకే నా కథలు సంపుటాలుగా చాలా ఆలస్యంగా డిసెంబర్ 2005లో వచ్చాయి. మొత్తం 60 కథలు రాసుంటాను. అందులో ఐదారు ఇప్పుడు దొరకటం లేదు. 'మంచు పల్లకి – మరి తొమ్మిది' రెండో ముద్రణ కూడా వచ్చింది. నా పేరుకు దగ్గరగా ఉండాలని కలం పేరు శ్రీపతి అని పెట్టుకున్నా. అప్పుడే నాకు శ్రీకాకుళం జిల్లా గొప్పిలిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. జీతంలో చాలా వరకు పుస్తకాలు కొనడానికి, స్నేహితులతో సినిమాలు చూడ్డానికి అయిపోయేది.

## నచ్చినవి

**కథ :** సుశీల(చలం)

**ఆధ్యాత్మిక గురువు :** శ్రీరామ్

**నటుడు :** చార్లీ చాప్లిన్

**సినిమా :** మల్లీశ్వరి(భానుమతి, ఎన్టీఆర్)

**హీరోయిన్ :** భానుమతి

**హీరో :** అక్కినేని నాగేశ్వరరావు

**పాట :** త్యాగరాజ కృతులు

**నవల :** అతడు-ఆమె (ఉప్పల లక్ష్మణరావు)

**కవి :** గురజాడ

**నచ్చిన కూర :** వంకాయ

**చాలా ఏళ్లుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నారు కదా?**

బీఈడీ చదువుకని హైదరాబాద్ వచ్చాను. 1965 నుంచి 74 వరకూ హైదరాబాద్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేశా. 66లో నా జీవిత భాగస్వామి లక్ష్మమ్మ నాకు పరిచయమయింది. ఈలోగా విరసంతో అనుబంధం పెరిగింది. విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక కార్యవర్గ సభ్యుడిగా తొలి నాలుగయిదేళ్లు చాలా చురుగ్గా పాల్గొనేవాణ్ణి. విరసం రాజ్యాంగం నా చేతిరాతతోనే ఉంది!

ఈలోగా న్యూఢిల్లీ ఆకాశవాణి తెలుగు వార్తావిభాగంలో న్యూస్ రీడర్‌గా ఉద్యోగం వచ్చింది. 77 నుంచి ఏడేళ్ల పాటు ఆ ఉద్యోగం చేశాను. ఢిల్లీ కూడా నామీద బోలెడంత ప్రభావాన్ని చూపించింది. వాక్య రచన ఎలా ఉండాలో ఆ రోజుల్లోనే నేర్చుకున్నాను.

**సాహిత్యపరంగా మీపై ఎవరెవరి ప్రభావాలుండేవి?**

నా సమకాలీన రచయితల్లో నన్ను బాగా ప్రభావితం చేసినవారు మంజుశ్రీ అదే అక్కిరాజు రమాపతిరావు. విశాఖ రచయితల సంఘం సమావేశాలు వైజాగ్ హిందూ రీడింగ్ రూమ్‌లో జరిగేవి. రావిశాస్త్రి వంటివారు మాట్లాడుతూ ఉంటే వినేవాళ్లం. వాళ్ళెవరికీ నేను తెలియదు. నా కథ అచ్చయ్యాక ఆంధ్రపత్రిక వార్షిక సంచిక కోసం అప్పటి ఎడిటర్ శంభుప్రసాద్‌గారు కథ పంపించమని నాకు ఉత్తరం రాశారు. అది నాకెంతో థ్రిల్లింగ్ అనుభవం. మొత్తమ్మీద చెప్పాలంటే సాహిత్యం నన్ను సంస్కరించింది.. ఆదర్శాలకు అనుకూలంగా జీవించేలా ప్రేరేపించింది.



కుటుంబ సభ్యులతో...

**మీ కుటుంబం గురించి చెప్పండి?**

1965 నుంచి స్థిరనివాసం హైదరాబాద్‌లోనే. నా భార్య లక్ష్మవ్వ పాతబస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి రిటైరయింది. మాకిద్దరబ్బాయిలు. పెద్దవాడు నవనీత్, చిన్నవాడు సంగ్రామ్. అందరూ చక్కగా స్థిరపడ్డారు. మనవలు, మనవరాళ్లతో కాలం హాయిగా నడుస్తోంది.

**అనువాదాలు ఏమైనా చేశారా?**

నేను ఇంగ్లిష్ నుంచి కొన్ని కథలు తెలుగులోకి అనువాదం చేశాను. సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రను ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువదిస్తే దాన్ని 'ఐ.ఎన్.ఎ చరిత్ర' పేరిట నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది. ఇదిగాక డాక్టర్ పత్తికొండ విశ్వంబర్‌నాథ్ భగవద్గీతకు రాసిన ఆంగ్ల వ్యాఖ్యానం 'తత్త్వం అసి' ని రెండు భాగాలుగా అనువదించాను. అది వెయ్యి పేజీల బృహత్ ఆధ్యాత్మిక గ్రంథం. ఇప్పటికింకా అముద్రితం. నావి కొన్ని కథలు ఇంగ్లిష్, హిందీలోకి అనువాదమయ్యాయి. ప్రసిద్ధ అనువాదకులు చేసిన అవి కేంద్ర సాహిత్య అకాడెమీ, నేషనల్ బుక్‌ట్రస్ట్, భారతీయ జ్ఞానపీఠ్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్, పెంగ్విన్ ఇండియా సంపుటాల్లోను, ఇండియన్ లిటరేచర్, సౌత్ ఏసియన్ రివ్యూ, జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ ఈస్తటిక్స్ పత్రికల్లో, వార్షిక సంపుటాల్లో ప్రచురితమయ్యాయి.

**కథలు కాకుండా మరేమయినా రాశారా?**

ఆధునిక సాహిత్య పోకడల మీద సమీక్షలు, వ్యాసాలు, జంటనగరాల్లోని చిత్రకళాధోరణుల మీద, ప్రసిద్ధ కళాకారుల గురించి పరిచయ వ్యాసాలు.. మధ్యమధ్య కవితలు.. రాశాను. అన్నీ వివిధ పత్రికల్లో వచ్చాయి. కొత్తగా ఆరాధనా గీతాలు రాస్తున్నా. మానవ ప్రకృతి కమనీయ కారుణ్య గాథలు వినిపించినప్పుడు, ప్రకృతి అందాలు మహిమాన్విత దివ్య సౌందర్యంతో ఆకర్షించినప్పుడు కథలు రాశాను. ఇంకా రాస్తూనే ఉన్నాను. మానవీయమైన విలువలతో స్ఫూర్తి పొంది, ఆత్మవికాసం దిశగా సాధన రచయిత గమ్యం అయినప్పుడు సృజనాత్మకమైన నిసర్గ సౌందర్యంతో సాహిత్యం భాసిస్తుంది. చారిత్రక భూమికతో సమకాలీన జీవితానికి ప్రతిబింబమై పాఠకుల హృదయాలపై ఉత్తమ అభిరుచులతో సాహిత్యం ప్రగాఢ ప్రభావం చూపుతుంది. అదే సాహిత్యం నన్ను రచయితగా తీర్చిదిద్దింది. ఇప్పుడొస్తున్న కొత్తవారిలో ప్రతిభావంతులు చాలా మందే ఉన్నారు.

– అరుణ పప్పు

నాకు నచ్చిన నా కథ

# బెనారస్ చిత్రాలు

- శ్రీపతి

బెనారస్. గంగానది. దశాశ్వమేధ్ ఘాట్. ఒక వేసవి ఉదయం. పదేళ్లు కూడా నిండని పడవ పిల్లవాడు కింది మెట్ల మీద నుంచుని నన్ను తన పడవలోకి రమ్మని, గంగానది మీద ఒడ్డు పొడవునా తిప్పుతానని బతిమాలుకుంటు న్నాడు. ఆ పిల్లవాడు పెద్ద మనిషి తీరున ధోతి కట్టుకున్నాడు. ఎర్ర గాపంచా తల పాగా చుట్టాడు. వాడి పెద్దపెద్ద కళ్లలో పసి తనంతో పాటు గంగానది అందం మెరు స్తున్నది. ఆ పడవ పిల్లవాని వెనకా ముందూ ఎక్కడా పెద్దమనిషి ఎవరూ ఉన్న జాడ లేదు. ఒడ్డున నీళ్లల్లో పడవ ఊగుతున్నది. ఆ పడవా, ఆ గంగానదీ, ఆ బెనారస్ ఘాట్‌లు అన్నీ తన ఆటస్థలాలే అన్నట్టుగా ఉంది వాడి మాట తీరు.

పురాణాల్లో బాలవీరుడిలా కనిపించాడు. ముందు హిందీలో చెప్పి, నాకు హిందీ అర్థం కాలేదని గ్రహించి ఇంగ్లీషులో "బోట్ రైడ్ సార్. బోట్ రైడ్ ఆన్ రివర్ గేంజస్ సార్. హోలీ గేంజస్ సార్ ఓన్లీ ఫైవ్ రుపీస్ సార్" అని వేడుకుం టున్నాడు.

ఇంత చిన్న కుర్రకుంకా నన్ను గంగానదిలో పడవలో తిప్పేది? "హెపీ బోట్ రైడ్ ఆన్ రివర్ గేంజెస్ సార్. ఓన్లీ ఫైవ్ రుపీస్‌సార్".

వద్దన్నాను, విసుక్కున్నాను. అయినా పడవ పిల్లవాడు నన్ను వదిలిపెట్ట లేదు. బెనారస్ మెట్రిక్యులేషన్ పరీక్ష రాస్తున్న శ్యామలను స్కూలు దగ్గర విడిచి పెట్టి, గంగానది అందాలను చూడటానికి ఘాట్‌ల వేపు రావటం ఇక్కడ నాకు నిత్య కార్యక్రమమయింది. బెనారస్‌ని చూట్టం నాకు అదే మొదటిసారి. అయినా పుట్టుకతో పరిచయం ఉన్నట్లు అనిపించింది. ఎన్నో పురాణకథలు, ఏక తార మీద మా తాతయ్య పాడిన తత్త్వాలు, మా అమ్మ కట్టుకునే బెనారస్ పట్టు చీరలు, కాశీమజిలీ కథలు, బెనారస్ విశ్వవిద్యాలయంలో చదువుకున్న నా స్నేహితుల అనుభవాలు అన్నీ కలిసి చిరస్మరణీయ సౌందర్యం మనసులో చల్లగా విచ్చుకుంటున్నది. గంగ ఒడ్డున స్నానఘట్టాల మెట్ల మీద జీవిత విడ్డూ రాలను చూస్తూ మణికర్ణిక నించి హరిశ్చంద్ర ఘాట్ వరకు తిరుగుతూ, నచ్చిన చోట స్నానంచేసి పరీక్ష ముగిసే సమయానికి స్కూలుకి పోయి శ్యామలను బసకు తీసుకు రావటం, పరీక్ష ఎట్లా రాసిందో కనుక్కోవటం, వంట చేసుకో వటం, భోజనం తర్వాత రెండో రోజు పరీక్షకు చదివించటం – అదీ నా దిన చర్య.

శ్యామల పరీక్షకు చదువుకుంటూ ఉంటుంది. దక్షిణాది వార్తలు వెతికినా దొరకని ఉత్తరాది వార్తా పత్రికల్లో తలదూర్చుకుని కూర్చుంటాను నేను. మధ్య మధ్య బెనారస్ గల్లీల్లో తిరిగి కూర గాయలూ, పెరుగూ, స్వీట్లూ కొనుక్కురా వటం..... అట్లా సాగుతున్నది.

ఈ వేళ దశాశ్వమేధ్ ఘాట్ దగ్గర ఓ మూల ఎవర్నీ పట్టించుకోకుండా స్కెచెస్ గీసుకుంటున్న విద్యార్థి కనిపించాడు. ఆ స్కెచెస్ చూస్తూ నుంచుండి పోయాను. ఆ యువ చిత్రకారునితో పరిచయం చేసుకోవాలని అనుకుంటుం డగా ఈ పడవ పిల్లవాడు వచ్చి గంగానదిలో తన పడవ మీద నన్ను తిప్పుతా నంటూ పట్టుకున్నాడు. వీడినెట్లా వదిలించుకోవటమో తెలీక తికమక పడు తున్న నా అవస్థ చూసి ఆ చిత్రకారుడు తన పని ఆపి పడవ పిల్లవాడిని కోప్ప డ్డాడు. దాంతో బిక్కమొగం వేసి అక్కణ్ణించి వెళ్లిపోయాడు పడవ పిల్లవాడు.

ఇదే మంచి సమయం అనిపించి చిత్రకారునితో సంభాషణ కలిపాను. అత నికి ఇంగ్లీషు రాదట.

అతను గీస్తున్న రేఖాచిత్రాలు నాకు కావాలి. అతడితో ఆ సంగతి చెప్పాలి. నాకు హిందీ రాదు. వచ్చిన పొడి పొడి హిందీ మాటల్లో ఎన్నెన్ని తప్పులో.

గంగానదిలో యాత్రికులు, భక్తులు, స్నానాలు చేస్తున్న దృశ్యాలు. రొమ్ము లోతున నుంచుని అర్ఘ్యం విడుస్తూ చేసే సూర్యవందనాలు. శరీరానికి అంటుకున్న తడి బట్టలతో ఒంటిధ్యాస లేని స్త్రీలు. ఎవరినీ... దేన్నీ పట్టించుకోని తన్మయ త్వంతో జనం. ఐదారుగురికి నీడనివ్వగల గొడుగుల కింద బల్లకట్టు మీద కూర్చుని కర్మకాండ చేయించే పండాలు. గోచీ పోసుకునే మరాఠీ చీరకట్లు. కుడి పైట వేసుకున్న గుజరాతీ స్త్రీల జట్లు. కుచ్చిళ్లు పాదాల మీదకు జారాడే దక్షిణాది స్త్రీలు రకరకాల అలంకరణలతో, కొత్తకొత్త అందాలతో, తొక్కిడి తొక్కిడిగా ఉంద క్కడ.

ఇన్నిరకాల ప్రాంతాల జాతుల జనాన్ని, వివిధ వయస్సుల వాళ్లని నాలు గయిదు రేఖల్లో నేర్పుగా పట్టుకుంటున్నాడా చిత్రకారుడు.

బెనారస్ అనుభవాలతో నేను రాయతలపెట్టిన వ్యాసాలకి ఆ స్కెచెస్ ఎంతో అందాన్నిస్తాయి. దాంతో ఆ స్కెచెస్ సంపాదించాలన్న ఉత్సాహం కలిగింది నాకు.


"చిత్ర్ అచ్ఛా" అన్నాను.

సంతోషం వెలిగిన కళ్లతో నా ప్రశంసని అతను స్వీకరించాడు.

అక్కడికి తన అభ్యాసం ముగిసిందో ఏమో అక్కణ్ణుంచి లేచాడు. పద్దెనిమి దేళ్లు ఉండొచ్చు. సన్నగా నాకన్నా పొడుగ్గా ఉన్నాడు. గంగానది ఒడిలోనే పుట్టి పెరిగినట్లున్నాడు.

మరో దృశ్యమేదో అతని కళ్లల్లో పడింది. రాతిమెట్ల మీద గొడుగులు అడ్డంగా లేనిచోట కూర్చున్నాడు.

నన్ను ఇంతవరకు పడవలో తిప్పుతానన్న పడవ పిల్లవాడు ఇద్దరు విదేశీ తెల్లవాళ్లను తన పడవ లోకి తీసుకున్నాడు. స్థూలకాయులైన ఇద్దరు యూరోపి యన్ ముసలమ్మలు మెట్ల మీంచి వేసిన చెక్కమీంచి నడిచి పడవలో అడుగు



పెట్టారు. వాళ్లు కూర్చున్న తర్వాత చెక్కను తీసేసి పడవను లోపలికి పోనిచ్చాడు.

పడవ కదిలే లోపు స్కెచ్ పూర్తయింది. గౌన్లతో, బాబ్డ్ హేర్‌తో, చేతిలో విశ్వనాథ్ మందిర్ దగ్గర కొనుక్కున్న బంతిపూల దండలతో, మెడల్లో కెమెరాలతో – ఆ పెద్ద వయసు శ్వేతజాతీయులు.

అటు గంగలో పడవ సాగుతున్న దృశ్యం.

ఇటు ఆర్టిస్ట్ తన స్కెచ్‌కి తుది మెరుగులు పెడుతున్న దృశ్యం. ఉత్తరేఖలే అయినా రంగుల హొయలతో ఊపిరి పీల్చుకుంటున్న అందం.

జనం రద్దీ, యాత్రికుల సందడి, కర్మ చేయించే పండాల గొడుగులు, ఇవేవీ లేని రాజాఘాట్‌లో స్నానం నాకు ఇష్టం. ఆ రేవులో పూలు, పసుపూ, కుంకుమా, ఆకులు, ఇతర పూజా ద్రవ్యాలను పండాలు నదిలో పారేసేది ఉండదు. ఇక్కడ దశాశ్వమేధ్‌ఘాట్‌లో అయితే వాటి మధ్యనే మునగాలి. నదిలోకి దిగటానికి నాలుగు మునుగులు మునిగి మళ్లీ బయట పడటానికి తీర్థ యాత్రికులతో, కర్మకాండ తంతుతో రద్దీ. ఒక కంటితో ఆర్టిస్ట్‌నీ, రెండో కంటితో చిత్తడిగా ఉన్న రాత్రి మెట్ల మీద ఉంచిన నా డ్రెస్‌నీ చూసుకుంటూ రెండే రెండు మునకలు వేసి, సబ్బు కూడా పెట్టుకోకుండా స్నానం అయిందనిపించి బైటపడ్డాను.

ప్రముఖ తెలుగు వారపత్రికలో నేను సబ్ ఎడిటర్‌ని, రచయితని. విరివిగా కథలూ, రెండు నవ లలూ, ఒక నాటకం, గ్రంథ సమీక్షలూ రాశాను. బెనారస్ మీద రాయతలపెట్టిన నా వ్యాసాలకీ మీ స్కెచెస్ కావాలి. మిమ్మల్ని తెలుగు దేశానికి పరిచయం చేయాలనిపిస్తోంది. మీ చిత్రాలు నాకు ఎంతో నచ్చాయి.... అతనితో ఇన్నీ చెప్పుకోవాలని ఉంది. కాని హిందీ రాదు.

పండాలకు పార్టీలను కుదిర్చే ఏజెంట్లు – వాళ్లన్నా దొరుకుతారేమోనని వెతికాను – దుబాసీ చేయ టానికి. వాళ్లు కనిపించలేదు. సినిమాల హిందీతో, కళ్ల చూపుల్తో, అభినయంతో ఆరంభించాను. ''అఖ్‌బార్ మే – మై – సబ్ ఎడిటర్''

అట్లా టెలిగ్రాఫిక్ భాషలో సాగింది.

నా కథ అర్థమైనట్టుంది అతనికి.

***

హరిశ్చంద్రఘాట్‌కి దగ్గర్లో, ఇరుకు సందుల్లో, కాయస్థుల ఇంట్లో ఓ గదిలో మా బస. పొరుగు గదిలో నేపాలీ కుటుంబం. ఇంటివాళ్లు మేడ మీద నవ్వు ముఖాలతో పలకరింపులు, ''సబ్ ఠీక్ హై?'' అని అడుగుతారు కనిపించినప్పుడల్లా. ఇంటామె మధ్య వయస్కురాలు.

''అచ్ఛాహై భాయిసాబ్?'' అంటుంది.

పక్క గది లోని నేపాలీ ఆమె స్నేహపు చూపులు చూస్తుంది. మాకు భాషతో పని లేదు. మాకు అవసరమైనవన్నీ ఆమె కనిపెట్టి గుర్తుచేసి కోరి ఇస్తుంది. మంచితనం, అందం తొణికిసలాడే పల్లెటూరు ముఖం. ఇరవయ్యేళ్లు కూడా ఉండవేమో. నెలలు నిండిన మనిషి, కన్నవారు లేరో ఏమో. కనీసం రోజుకోసారన్నా తాను ఇంట్లో చేసి పెట్టుకునే స్వీట్లు, చపాతీలు, సబ్జీలు మాకు పంపిస్తుంది. ఆమెకి చాలా ఇష్టమని తెలిసి మా కోసం తెచ్చుకున్న ఆవకాయ శ్యామల ఆమెకు ఇచ్చింది. ఏమి కావాలన్నా వాళ్లింట్లోంచి తెచ్చుకునే చనువు శ్యామలకి ఆమెతో ఏర్పడింది. బెనారస్‌లో ఆ నేపాలీ ఆమె మా తొలిస్నేహితురాలు అనుకుంటే, నబనీత్ రెండో వాడు.

నబనీత్‌ని గదికి తీసుకుని వచ్చాను. ఉదయం పరీక్షకు పోయే సందడిలో గదిలో ఏవీ సర్దుకోలేదు. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. మంచం మీద శ్యామల వోణీ, బ్లౌజ్ పడి ఉన్నాయి. గదిలో పార్టిషన్‌గా తాడు మీద వేసిన జరీ అంచు పసుపురంగు చీర. అదే తాడు మీద రెండు మూడు వోణీలు, పరికిణీలు, సూట్‌కేసు మీద అద్దం. వాడిన పూలమాల. అన్నీ

సర్ది నబనీత్‌ని మంచం మీద కూర్చోమన్నాను.

బెనారస్ మెట్రిక్యులేషన్ పరీక్ష రాయటానికి వచ్చిన చెల్లెలికి తోడుగా ఉన్నట్లు నా కొత్త స్నేహితునికి అర్థమయిందనే అనుకుంటాను.

శ్యామల పరీక్షనించి బయటపడే సమయం. స్కూలుకి పోయి శ్యామలను తీసుకురావాలి. ఇంటికి తెచ్చిన ఈ ఆర్టిస్ట్‌కి ఏమిచ్చి ఆదరించాలో తోచలేదు. బిస్కట్లు అయితే ఉన్నాయి కాని, అవి ఇచ్చి సత్కరించే వ్యవధి లేదు. కనీసం మనసు విప్పి మాట్లాడుకుందామంటే భాష అడ్డం.

ఢిల్లీలో ఓ ప్రముఖ ఇంగ్లీషు దినపత్రికలో మా పెద్దన్నయ్య అసిస్టెంట్ ఎడిటర్. ఈ పరీక్షలు ముగిశాక ఇక్కణ్ణించి మేము ఢిల్లీ వెడుతున్నాము. మా స్వగ్రామం శ్రీకాకుళం. కాని ప్రస్తుతం గత మూడు దశాబ్దాలుగా మేము మద్రాసులో ఉంటున్నాము. మా నాన్నగారు అడ్వకేటు. బిజినెస్‌లో దిగేరు. భాషతో ఇబ్బందిపడకుండా ఈ వివరాలన్నీ చెప్పాను. పొరుగింటి నేపాలీ ఆమె భర్తతో రెండు గ్లాసుల్లో మంచి చాయ్ పంపించింది.

రెండో రోజు శ్యామలకు పరీక్ష లేదు. వరుసగా రెండు రోజులు సెలవు. ఉదయమే నబనీత్ వచ్చాడు. నేనింకా స్నానం చేయలేదు, బద్ధకం. అంత గొప్ప నది ఒడ్డున ఉండే అదృష్టం పట్టిన తర్వాత కూడా ఇంట్లో ఇరుకు బాత్‌రూంలో స్నానం చేయటమన్న ఆలోచనే ఇబ్బందిగా ఉంటుంది నాకు.

''బాత్‌రూమ్‌లో కూడా గంగాజలమేలే అన్నయ్యా – స్నానం ఇక్కడే చెయ్యొచ్చు!'' అని అంటుంది శ్యామల. గంగాజలం వేరు, గంగా నది వేరు. పరీక్షలేదు కదా అని బద్ధకంగా లేచి ఉత్తరాది వింతలు చెప్పుకుని నవ్వుకుంటున్నాం. పూరీలు, పెరుగు తూకం వేసి సొగ్రామ్, పావు కేజీ, ఆధా కేజీ అమ్ముతారు. ఆవనూనె వాడకం. చుట్టూ ఆవనూనె వాసన. అక్కడి రిక్షాలు కొత్త. రిక్షాల్లో నుంచున్నట్లు ఉంటుంది. ఆధా సవారీ – ఎంతదూరం వెళ్లినా సగం పైసలే. విశ్వనాథుడిని బిశ్వనాథ్‌జీ అంటారు. దేవుడికి 'గారు' అని గౌరవ వాచకం ఏమిటని నవ్వుకుంటాము. ఇక్కడ ఎవరిని పేరడిగినా అవి శివపార్వతులతోనే ఉంటున్నాయి. గంగానదిని గంగాజీ, గంగా మాయీ అని తమ ఇంట్లో తల్లిలా కొలుస్తారు. ఈ ముచ్చట్లతో కొంతసేపు గడిపాం. శ్యామల స్నానానికి వెళ్లింది. బయట నేపాలీ వాళ్లు ఉంటున్న గదికి ఆనుకుని ఉమ్మడి స్నానాల గది. నేపాలీ ఇంటివాళ్లనడిగి కుర్చీ తెచ్చి నబనీత్‌ని కూర్చోమన్నాను.

నబనీత్ లేత నీలం రంగు కాటన్ పొట్టి చొక్కా తొడుక్కున్నాడు. ముదురు నీలం రంగు టెర్రికాట్ పేంట్. అది కూడా పొట్టిగానే ఉంది. డిజైన్ అల్లిక చెప్పులు. ఆ చెప్పుల్లో అతని కళాభిరుచి వ్యక్తమవుతున్నది.

''పితాజీ – పత్ర్'' అన్నాను – నాన్నకు ఉత్తరం రాస్తున్నానన్నది నా భాష. నేను ముందేసుకుని కూర్చున్న ఇన్‌లేండ్ లెటర్లు, పోస్టల్ కవర్లు చూసి నబనీత్ ఆశ్చర్యపోతున్నాడు. దాదాపు ఓ డజనుకు పైగా రాసినవి పడి ఉన్నాయి. ఇంకో అరడజను కనీసం రాయాల్సి ఉంది.

ఇంకా ఉదయం తొమ్మిది కాలేదు. రాత్రి చాలా పొద్దుపోయే వరకూ కూర్చోబెట్టి శ్యామలను చదివించాను. నేను నిద్రపోతే తనూ నిద్రపోతుంది. నేను మేల్కొని ఉంటే కాఫీలు తాగుతూ పరీక్షకు చదువుతుంది. రాత్రే కొన్ని ఉత్తరాలు రాయటం ముగించాను. ఉదయం నిద్ర లేచే సరికి ఎనిమిది కావచ్చింది.

శ్యామల స్నానం చేసి తడి శరీరంతో వచ్చింది. గదిలో తాడు మీద పార్టిషన్‌గా వేసిన చీరచాటుకు వెళ్లిపోయింది.

శ్యామల ఆ రోజు వోణీ పరికిణీలకి బదులు చీర కట్టుకుంది. ముదురు ఆకుపచ్చరంగు. మందారం రంగు అంచు. మాచింగ్ బ్లౌజ్. ఆ గదిలో మూగ వాతావరణంలో శ్యామల గాజుల చప్పుడే భాషలా ఉంది. బొట్టు ఇంకా పెట్టుకోలేదు. వచ్చి, ''ఈయనేనా నువ్వు చెప్పిన కళా కారుడు?'' అడిగింది, తెలుగు నబనీత్‌కి అర్థం కాదన్న ధైర్యంతో.

కాని ఆమె అన్నది నబనీత్‌కి అర్థమైనట్లే ఉంది.

''బహిన్ శ్యామల'' అని పరిచయం చేశాను.

అతనికి శ్యామల నమస్కరించింది. ఆ పరిచయం అతనికి కొత్త అనిపించిందేమో. ఇబ్బంది పడ్డాడు. ప్రతి నమస్కారం చేశాడు.

బొట్టు పెట్టుకోవటానికి అద్దమూ, కుంకుమా తీసుకుని శ్యామల మళ్లీ తన 'గది'లోకి వెళ్లి పోయింది. కాఫీ పెట్టమని శ్యామలకి చెప్పి బిస్కెట్లు తీసుకు రావటానికి బయటికి వెళ్లాను.

తిరిగి అయిదు నిమిషాల్లో నేను వచ్చేసరికి నబనీత్ చేతిలో తెల్ల కాగితం, అట్ట, పెన్సిలు ఉన్నాయి.

''చిత్ర్ చిత్ర్'' అంటున్నది శ్యామల. బొమ్మలు గీయమని చెప్పడం శ్యామల ఉద్దేశం.

ఏం గీయను, ఏముంది అన్నట్టు కొత్తవల్ల ఇబ్బంది పడుతున్నాడు నబనీత్.

అప్పుడప్పుడే నల్లబడుతున్న నూనుగు మీసాలు. గడ్డం మీద ఇంకా రేజర్ పడినట్టు లేదు. పొడుగ్గా రోమన్ ముక్కు. ప్రపంచంలోని స్వప్నాలను, సౌందర్యాలను వెతుక్కునే చూపులు. చురుకైన నాజూకైన పొడవాటి చేతి వేళ్లు. అతను పెన్సిల్ పట్టుకున్న తీరు చూస్తే చాలు – పెన్సిల్ దానంతటదే కళా ప్రపంచాన్ని సృష్టించుకు పోగలదు అనిపిస్తుంది.

మధ్య మధ్య నుదుటి చెమట తుడుచుకుంటున్నాడు.

నేను లోపల అడుగుపెట్టడంతో నన్ను చూపించి ''భాయికా చిత్ర్'' అని తన ఆదేశం ప్రకటించింది.


శ్యామల కాఫీ పెట్టటానికి గదిలో ఓ మూలకు వెళ్లింది. దాంతో తెరిపి చిక్కినట్లయి, ఊపిరి పీల్చుకుని, నా ఎదురుగా కూర్చుని నాలుగు గీతలు గీశాడు నబనీత్.

ఆ కాగితం మీద సత్యమూర్తి!

ఆ ముఖంలో కొత్తకళ నాకే అందంగా కనిపించింది. చాలా నచ్చింది. నేను తిరిగి మద్రాసు చేరుకునే సరికి ప్రెస్ నించీ బయటపడే నా కథల పుస్తకం చివరి అట్ట మీద రచయిత పరిచయానికి ఈ రేఖా చిత్రం రివర్స్‌లో వేస్తే బావుంటుందనుకున్నాను.

చిత్రం ఏ దశలో ఉందో చూట్టానికి వచ్చిన శ్యామల నా చేతిలో ఉన్న సత్యమూర్తి ముఖాన్ని చూసి ''అమ్మా బాపూ'' అని ఆశ్చర్యపోయింది.

చూసి చిత్రాన్ని అతనికి ఇచ్చాను. అతను తుది



మెరుగులు పెట్టేట్టు ఉన్నాడు. వెంటనే శ్యామల అతని చేతినుంచి ఆ చిత్రాన్ని తీసుకుని ఆ చేతిలో కాఫీ గ్లాస్ పెట్టింది.

నబనీత్ ఇష్టంగా తాగుతున్నాడు కాఫీ. ఈ కాఫీ కోసమే తాను ఇక్కడికి వచ్చినట్లు, కాఫీ గ్లాసు కింద పెట్టిన వెంటనే, వెళ్లి పోవాలని నుంచున్నాడు. ఇంకొంచెంసేపు కూర్చోమని చెప్పడానికి నేను హిందీ మాటలు వెతుక్కుంటుండగా శ్యామల ద్వారానికి అడ్డంగా నుంచుని, "నహీఁ నహీఁ" అని అతన్ని పోనివ్వకుండా ఆపేసింది.

"నీ ఇష్టం వచ్చినప్పుడొచ్చి నీ ఇష్టం వచ్చినప్పుడు పోవటానికి వీల్లేదబ్బాయ్" అంది తెలుగులో. "కాఫీ తాగి వెంటనే పోవాలనుకుంటున్నావ్. ఆ పప్పులుడ వకబ్బాయ్. మరి కొన్నిబొమ్మలు గీయ్. ఉత్తినే కాఫీ ఇచ్చాననుకున్నావా? ఆ కాఫీ అరిగే వరకు ఇక్కడ కూర్చుని నా బొమ్మలు కూడా గీసి, వాటిని మాకు ఇచ్చేసి, మర్యాదగా వెళ్లు. గొప్ప పెద్దమనిషివే. కాఫీ తాగి పోదామనుకుంటున్నావ్?"

తెలుగు అర్థం కాని నబనీత్ అవస్థను బాగా ఎంజాయ్ చేశాము. నవ్వితే ఆటపట్టిస్తున్నామని అనుకుంటాడేమోనని నవ్వు ఆపుకుని బిగపట్టి కూర్చున్నాను. అయినా నబనీత్ ఆగలేదు. ఎవరో పిలుస్తున్నట్లు వెళ్లిపోయాడు.

మధ్యలో ఓ మూడు రోజులు నబనీత్ కలవనే లేదు. అతనినెట్లా పట్టుకోవటమో తెలీక అతడే వస్తాడని ఎదురు చూస్తున్నాం. శ్యామల పరీక్షకు బయలు దేరుతుండగా వచ్చాడు నబనీత్.

"ఏమై పోయావయ్యా ఇన్నాళ్లు, భయపడ్డావా?" అని ధాటిగా ముఖం మీద తెలుగులో అడిగేసింది శ్యామల. "నిన్నెవరు ఎత్తుకు పోర్లే. నువ్వు రావచ్చు" అని ఒకటే ఏడిపిస్తున్నది. తెలుగు భాష రాక, శ్యామల మాటల వెనక ఉన్న భావం అర్థం కాక స్పోర్టివ్‌గా నవ్వు ముఖం పెడతాడు నబనీత్.

ఆ రోజు శ్యామలను స్కూలు దగ్గర విడిచి పెట్టిన తర్వాత నన్ను తనతో వాళ్లింటికి తీసుకు వెళ్లాడు. బిశ్వనాథ్ మందిర్‌కు దగ్గర్లో, ఇద్దరు మనుషులు కూడా తప్పుకోవటం కష్టమనిపించే ఇరుకు గల్లీలోంచి వెళ్లాం. రెండు మూడం తస్తుల పాతకాలపు భవనాలు. ఎర్రటి ఇటుకలు పేర్చిన సన్నటి సందులు. మరీ పెద్దదనిపించే ఓ పాతభవనంలోకి దూరాం. పట్టు చీరల నేత పని సాగుతున్న గదులు దాటి లోపలికి వెళ్తే ఖాళీ స్థలం. వెనుక ఇల్లు.

నబనీత్ కుటుంబాన్ని చూడబోతున్నానన్న ఆనందం ఓ పక్క. ఉత్తరాది కుటుంబ జీవితం గురించి తెలుసుకోవటానికి అవకాశం దొరికిందన్న ఆనందం మరో పక్క. ఎంతో కుతూహలంగా ఉంది. అక్కడికి వెళ్లిన మీదట అతను చెప్ప కముందే నాకు తెలిసిన సమాచారం ఏమిటంటే వాళ్ల కుటుంబం అక్కడ లేదని.

నబనీత్ ఆర్ట్ స్కూలు విద్యార్థి అయి ఉంటాడు. లోపల మంచం మాదిరి బల్ల ఉంది. దాని మీద కూర్చున్నాను. వందేళ్ల క్రితం కట్టిన ఇల్లే అయినప్పటికీ ఎంతో విశాలంగా, అందంగా ఉంది.

"ఈశ్!" లోపలికి వినిపించేట్టు పిలిచాడు నబనీత్.

దాదాపు ముప్పయ్యేళ్ల వయసులో ఉన్న ఈశ్ వచ్చి నేల మీద పెద్ద జంప ఖానా పరిచాడు.

రాగి పాత్రలు. దేవుని పటాలు. పాలు పొంగి మాడిన వాసన. నేత మగ్గం చప్పుడు.

ఈశ్ మన అన్నం పళ్లేల్లాంటి రెండు పెద్దపళ్లేల్లో కనీసం ఒక అర్ధ కిలోకి తక్కువ కాకుండా రకరకాల స్వీట్లు తెచ్చి పెట్టాడు. కింద జంపఖానా మీద కూర్చుని, స్వీట్లు తినమని నబనీత్ ఒత్తిడి. వాటిని చూస్తేనే భయమేసింది. మొత్తం తినమంటాడేమో. రెండు మూడు తినే సరికి మొహం మొత్తింది. అవి కూడా మామూలు సైజులో లేవు. మద్రాసులో దొరికే వాటికి రెట్టింపు సైజు ఉంటాయి. ఇంకా ఇంకా తినమని బలవంతం.

ఇంతలో ఈశ్ పాలు తెచ్చాడు. అర్ధలీటరు పట్టే కంచుగ్లాసులో నిండా, మర గిన మంచి వాసన. కొంచెం ఏలకులపొడి చల్లినట్టుంది.

తీపితో నాలుక మొద్దుబారిపోయింది.

పాలు తాగుతుండగా తన స్కెచ్ బుక్స్ రెండు నా ముందు ఉంచాడు నబ నీత్.

ఒక్కొక్క పేజీ తిప్పి చూస్తున్నాను. ఆ చిత్రాల్లో ఏళ్లు నిండిన ఒక ముస లమ్మ పదే పదే కనిపిస్తోంది. ముడతల ముడతల ఒళ్లు. నడుం పడి పోయింది. వాలిపోయే నడక.

"మా నాయనమ్మ. నూరేళ్లు నిండిన పెద్దవయసు. కాశీ పుణ్యక్షేత్రంలో చని పోతే పుణ్యం అని బెనారస్ వచ్చింది. ఇరవయ్యేళ్లుగా ఇక్కడ ఉంటున్నది. ప్రతి రోజూ వేకువనే లేచి గంగలో స్నానం చేసి వస్తుంది. దార్లో కనబడిన ప్రతి మందిరంలో పూజ చేస్తుంది. మధ్యాహ్నం ఏ ఒంటిగంటకో ఇల్లు చేరుకుం టుంది. ఈశ్ వంటవాడు. రొట్టె పెడతాడు. ఒక పూట తిండి. సాయంత్రం దగ్గర్లో దేవాలయ మంటపం మీద కూర్చుంటుంది. రాత్రి వచ్చి ఇంట్లో పడు కుంటుంది".

నా మీద కసి తీర్చుకుంటున్నట్టు హిందీ వచ్చిన వాడితో మాట్లాడుతున్న ట్టుగా చెప్పుకు పోతున్నాడు నబనీత్. ఆ చిత్రాలు, నబనీత్ అభినయం. అక్కడి పరిసర వాతావారణం – అన్నీకలసి చెప్పిన కథ అది. నేను అర్థం చేసుకున్నది, ఊహించినది తప్పుకూడా కావచ్చు.

స్కెచెస్‌లో నబనీత్‌ని ప్రభావితం చేసిన జీవితం స్పష్టంగా తెలుస్తూనే ఉంది. నబనీత్‌కి జన సమ్మర్దమైన ప్రదేశాలు ఇష్టం. పళ్లూ, కూరగాయలూ, పూలూ అమ్ముకునే దృశ్యాలు ఇష్టం. పనులు చేసుకునే మనుషుల గుంపులు ఇష్టం. పని చేస్తున్న మనుషులు ఇష్టం. గ్రామ పరిసరాలు, పంట పొలాలు, పసుల కాపర్లు, నది ఒడ్డున ఇసుకలో, కూరుకుపోయిన పడవలు, చేపల వల మోసుకుపోతున్న జాలర్లు –

నది ఒడ్డున పడవ నించి సరుకులు దించుతున్న నలుగురు కూలీలు... వాటర్ కలర్స్‌లో వేసిన పెయింటింగ్ ఎంతో బావుంది.

## కథాంతరంగం



నా ఇరవై అయిదవ ఏట 1963 మార్చి నెలాఖరులో తొలిసారి బెనారస్ చూశాను. దాదాపు మూడువారాలు అక్కడ గడిపాను. ఎంత చూసినా తనివి తీరని అందం గంగానది. దశాశ్వమేధఘాట్‌లో పుణ్యస్నానాలు చేసి, విశ్వ నాథ్ మందిరానికి వచ్చి, స్వయంగా గర్భగుడిలో గంగాజలంలో అభిషేక ప్రియుడిని అర్చించటం భక్తుల భాగ్యం.

ఆ ఆనందంలో రాసిన కథే 'బెనారస్ చిత్రాలు'.

దివంగత మిత్రులు శ్రీ మధురాంతకం రాజారాంగారు అన్నట్టు 'త్రివేణి సంగమంలో సరస్వతిని వెదుక్కున్నట్టుగా యిందులో కథా సూత్రాన్ని వెదుక్కోవలసిందే'.

ఆ కథలో కథకన్నా ముఖ్యమైనవి బెనారస్ అపురూపమైన అందాలు.

బెనారస్ చూడటం నాకు అదే మొదటి సారి. తర్వాత మరో మూడుసార్లు చూశాను.

గంగానదిని అక్కడ ప్రజలు గంగామాయి అంటారు. ఆ ప్రజల్లో ప్రేమ అవ్యాజం. అనిర్వచనీయం. వారి ప్రేమ శ్యామల, నబనీత్ యువ హృదయంలో పల్లవించి ప్రేమకథ అయింది. నబనీత్‌ని శ్యామల మళ్లీ కలుసుకునే భాగ్యం లేనట్టే. రైలు కదిలిపోయే వరకు నబనీత్ స్టేషన్‌కు వస్తాడని శ్యామల ఎదురు చూసింది. నబనీత్ రాలేదు. శ్యామల కళ్లనించి అశ్రువులు రాలుతున్నాయి. గంగామాయి శ్యామలకు బెనా రస్‌లో బహూకరించింది చివరకు ఈ అశ్రువులనే.


ఈ కథ నా 31వ ఏట 1969లో రాశాను. నా 50వ ఏట నవంబర్ 9, 1988లో 'ఆంధ్రప్రభ' వారప త్రికలో అచ్చయింది. దాదాపు ఇరవై యేళ్లు ఆ కథకు మార్పులు, చేర్పులు చేస్తూ రాస్తూనే ఉన్నాను. మిత్రులు శ్రీ ఎమ్. రాజేంద్ర గారిని చూడటానికి ఆంధ్రప్రభ ఆఫీస్‌కి వెళ్తే కథ కావాలని అడిగినప్పుడు 'బెనారస్ చిత్రాలు' వారికిచ్చాను.

నిజానికి బెనారస్ ఆధ్యాత్మిక దృశ్యాలే... ఈ కథ.

వాళ్ల స్వగ్రామం అక్కడకు నలభై కిలోమీటర్ల దూరంలో గంగానది ఒడ్డునే ఉందట. చెరుకు నాట్ల సమయం. గోధుమ నూర్పు. పెద్దలు వ్యవసాయం పనుల్లో ఉండడం వల్ల అతను నాయనమ్మతో పాటు ఉండటానికి వచ్చాడట. తన గ్రామం సమీపంలోని టౌన్‌లో గ్రాడ్యుయేషన్ మొదటి సంవత్సరం చదువుకుంటున్నాడట. ఇప్పుడు సెలవులు. చిత్రలేఖనం తనకి ఇష్టం. చిత్రలేఖనం వృత్తిగా బతకాలనుకుంటున్నాడట.

నబనీత్ నాయనమ్మను చూడాలి. అయితే ఇవేళ వీలు పడదు. ఘాట్స్‌లో స్నానం. కూర గాయలూ, పెరుగు కొనుక్కోవటం, శ్యామలను తీసుకురావటానికి బడికి వెళ్లటం – అప్పటికే జాప్యం అయిందని తొందరపడ్డాను. మరోసారి వచ్చి నబనీత్ స్కెచ్‌బుక్స్‌తో తీరిగ్గా కాలక్షేపం చెయ్యాలి. వీలు చిక్కితే ఓ పెయింటింగ్‌ని సంపాదించుకోవాలి.

హిస్టరీ పేపర్‌కోసం చదువుతున్న శ్యామల ఔరంగజేబు పతనానికి కారణాలు చెబుతూ – కిందటి సాయంత్రం విశ్వనాథ్ మందిర్ దగ్గర – హిందూ దేవాలయాన్ని పడగొట్టించి అవే గోడల మీద కట్టించిన మసీదు చూసి – ఆ ప్రశ్న పరీక్షలో వచ్చేటట్టయితే ఔరంగజేబుకి ఉన్న హిందూ మతద్వేషం గురించి గట్టిగా రాస్తానని చెబుతున్నది. ఔరంగజేబు – అన్నదమ్ముల్ని చంపిం



చటం, తండ్రిని జైల్లో పెట్టటం, ఇంకెందర్నో హత్య చేయించటం, హిందువులని హింసించటం–

చదువు కాస్తా మరిచిపోయి చర్చల్లో, పోట్లాటల్లో ఉండగా నబనీత్ వచ్చాడు.

ఒకరి భాష ఒకరికి రాదు. అతను ఏమో చెప్తాడు. మాకు అర్థంకాదు. చూపుల భాషతో సాగుతుంది. హృదయం ఉప్పొంగి వస్తుంది. అతను వస్తూనే ఒక కళాప్రపంచాన్ని తెస్తాడు. ఆ చూపుల్లో ఎన్ని అద్భుతాలో!

శ్యామల తెలుగు ధాటిగా మాట్లాడేస్తుంది. అర్థం కాక కొన్నిసార్లు తెల్లబోయి చూస్తాడు. ''పిచ్చీ ఏమిటట్లా చూస్తావ్'' అంటుంది ముద్దు మురిపాలతో.

నవ్వుకుంటాము. కెరటమొచ్చి పలకరించినట్టుగా అనుభూతి అందుతుంది – అతనికీ, మాకూ.

ఉదయం పరీక్ష నుంచి వచ్చినప్పుడు నబనీత్ కబుర్లు.

''అక్కడ గంగానది ఒడ్డునే వాళ్ల స్వగ్రామం అంటున్నావు కదా? ఎక్కడన్నా గంగలో కలియడమే కదా? ఈ కాశీలో ఎందుకు పాపం. ఇరవై ఏళ్ల నించా? నూరేళ్ల నిండాయా? తప్పకుండా చూడాలి అవ్వను. దగ్గరే అంటున్నావుకదా. వెళ్లి గంగఒడ్డున వాళ్ల పల్లెటూరు కూడా చూద్దాం అన్నయ్యా!''

''నువ్వు అక్కడకు వెళ్లి, ఇక్కడ ఈ నదీ, ఈ పంట పొలాలూ, ఈ మనుషులూ, ఈ ఇల్లూ అన్నీ నాకు నచ్చాయి, ఇక్కడే ఉండిపోతా, అమ్మా నాన్నకి చెప్పెయ్యి అంటావేమే?''

శ్యామలను ఏడిపించాలనుకుంటాను. అయితే కోపం వచ్చిందో అలిగి పోతుంది. ఆ రాత్రికి తిండి ఉండదు. పుస్తకాలు చిరిగిపోవచ్చు. పరీక్ష మానేయ వచ్చు. ఆ భయంతో ఆమెను ఏడిపించాలన్న ఆలోచనని నాలో నేనే దాచుకుంటాను.

శ్యామలను సినిమాల్లో ప్రవేశ పెట్టాలని చిన్నాన్న ఆలోచన. ఢిల్లీ నించి తిరిగి మద్రాసు చేరుకునే సరికి సెట్స్ మీదికి రమ్మన్న ఆదేశం వచ్చినా ఆశ్చర్య పోనక్కర లేదు. నాన్నకు ఇష్టంలేదు, వ్యతిరేకిస్తున్నాడు. సినిమా పరిశ్రమ అందరికీ పడదంటాడు. అమ్మకు ఇష్టమే. ఇంకా ఈ సంగతి శ్యామలతో చెప్ప లేదు. గ్రాడ్యుయేషన్ పూర్తయితే బావుంటుందని చెప్పి వాయిదా వేయటం ఒక సాకు మాత్రమే. చిన్నాన్న తెలివైనవాడు. ఎక్కడో ఇరికించి తన మాట సాగించు కుంటాడు.

అన్నయ్య కోసం ఢిల్లీ తీసుకువెళ్తున్న ఫామిలీ ఆల్బమ్ ఒకటి ఉంది. దాంట్లో మా కుటుంబ సభ్యుల ఇటీవలి ఫొటోలు మొత్తం ఉన్నాయి. ఆ ఫొటోలు చూపించాలని నబనీత్ చేతిలో పెట్టి స్వీట్స్ తీసుకురావటానికి బయటికి వెళ్లాను.

తిరిగి నేను వచ్చేసరికి శ్యామల – ఆ ఫొటోలలోని వాళ్ల పేర్లు చెబుతున్నది. శాంతి ఫొటో చూస్తున్నాడు. అక్కడే మా ఆవిడతో రెండు పక్కలా కూర్చున్న మా ఇద్దరు – ఆరు, నాలుగేండ్ల – బాబుల ఫొటోలు ఉన్నాయి.

అందరం స్వీట్స్ తిన్నాం. కాఫీ తాగాం. ఓ చేతిలో ఆల్బమ్ పట్టుకునే ఉన్నాడు.

''ఈయన ఈ ఆల్బమ్‌నే ఎత్తుకుపోయేట్టున్నాడు'' అంది శ్యామల. అట్లా ఉంది అతడు పట్టుకున్న తీరు.

ఇప్పుడు నబనీత్ మాకు అలవాటుపడ్డాడు. బెదురు, కొత్త పోయాయి. మేము నవ్వితే నవ్వుతాడు. మర్యాద తెచ్చి పెట్టుకుంటాడు. అట్లాంటి వాళ్లతో గెలవటం కష్టం.

వెళ్లిపోయే ముందు మేము భయపడ్డట్టుగానే ఆల్బమ్‌లో తనకు ఓ ఫొటో కావాలని అడిగాడు. అతన్ని అంతగా ఆకర్షించిన ఫొటో ఏమిటా అని చూస్తే శ్యామల క్లోజప్. మోహన్ తీసిన ఫొటో. శ్యామల ఆరంగేట్రమ్ అప్పుడు పత్రికల్లో వచ్చిన పరిచయాల్లో ఆ ఫొటో ప్రసిద్ధమయింది. ఆ ఫొటో ఇవ్వాలని నాకు లేదు. కాని శ్యామల ''తీసుకో'' అని తలూపింది.

ఫొటోని అందంగా ఊడదీశాడు. ఆ ఫొటో కోసమే వచ్చి పడిగాపులు పడినట్టు అది దొరికిన తక్షణమే లేచి మళ్లీ కలుస్తానని చెప్పి బయటపడ్డాడు. ఇంకొంచెం సేపు ఆగేట్టయితే మనసు మార్చుకుని ఎక్కడ ఈ మద్రాసీలు ఆ ఫొటోని అడిగి తీసుకుంటారోనని అనుకున్నాడో ఏమో.

''ఉత్తరాది వాళ్లు గట్టివాళ్లే. ఇంకొద్ది సేపు ఉండనిస్తే మొత్తం ఆల్బమ్ కావాలనేట్టున్నాడు ఈ ఆర్టిస్ట్. నయం, దయచెయ్యి నాయనా'' అంది శ్యామల. నబనీత్ వెనక్కి చూడనన్నా చూడకుండా వెళ్లిపోయాడు.

సాయంత్రం ఘాట్‌లలో తిరిగే వేళయింది మాకు. మేమూ కదిలాం.

''రామ్ నామ్ సత్య్ హై.... రామ్ నామ్ సత్య్ హై...'' అని పాడుకుంటూ మృతదేహాలను అంత్య క్రియల కోసం తెస్తారు మణికర్ణికాఘాట్‌కి. అక్కడ శ్మశాన వాటికలో దహనక్రియలు జరుగుతుండడం చూసి శ్యామల భయపడి పోయింది. రాత్రి నిద్ర లేదు. నేపాలీ ఆమె వచ్చి ఆ అర్ధరాత్రి చాలాసేపు శ్యామలకు తోడుగా కూర్చుంది. బెనారస్ ముచ్చట్లు వేరే ఎన్నిచెప్పినా ఆమెలో ఆ భయాన్ని తొలగించలేకపోయాం.

ఆఖరి పేపరు సివిక్స్. సరిగ్గా రాయలేదేమో అన్న అనుమానం. ఆ మణికర్ణిక ఘాట్ వేపు ఎందుకు తీసుకుని వెళ్లానా అని నన్ను నేనే తిట్టుకుంటున్నాను. నబనీత్ వస్తే బావుండును. రెండ్రోజుల నించి కనిపించటం లేదు. ఈ వేళ వస్తా


డేమో! పెద్దన్నయ్యకు టెలిగ్రామ్ ఇచ్చిన సంగతి చెప్పాను. నాన్న రాసిన ఉత్తరం చదివి వినిపించాను. ఆల్బమ్ తీసి చూపించాను. ఎన్ని చెప్పినా శ్యామలలో మార్పు పెద్దగా కనిపించలేదు. చివరకు చదవకుండానే పరీక్షకు వెళ్లింది. ఏదో రాస్తుందిలే అన్న ధైర్యం. స్కూలు దగ్గర, పరీక్షకు వచ్చిన కొంతమందితో కొత్త స్నేహం ఏర్పడింది. వాళ్లు కనబడ్డప్పుడు మాత్రం వాళ్లతో మామూలుగా మాట్లాడింది. కొంత నయమని అనుకున్నాను. నబనీత్ వస్తే బావుండును.

ఆ చివరి పరీక్ష రోజునే శ్యామల పదిహేడో పుట్టినరోజు. గంగానదిలో స్నానమే పుట్టిన రోజు బహుమతి. పరీక్షల పీడ విరగడైనందుకు శ్యామల సంతోషంతో గంతులేసేది. ఎన్నెన్ని నవ్వులు నువ్వుకునే వాళ్లమో.

బెనారస్‌కి, అక్కడి సంస్కృతికి ఒక విలక్షణమైన ఔన్నత్యం ఉంది. బెనారస్ అక్కడికి వచ్చిన పర్యాటకులను, యాత్రికులను, భక్తులను ఎంతో ఆదరంగా స్వీకరిస్తుంది. ఈ ఇల్లు నీది, ఈ నది నీది, ఇక్కడ అందాలన్నీ నీవే అన్నట్టుగా ఉంటుంది. ఈ పూలు తీసుకో, ఈ స్వీట్లు తిను. ఈ పళ్లు నీ కోసమే తెచ్చి పెట్టాం అంటున్నట్లు అక్కడి వర్తకులు – వ్యాపార లక్షణమే అయినా – ఎంత ఆప్యాయత చూపుతారో! వాళ్ల మాటల్లో వ్యాపార లక్షణం కన్నా మానవ ప్రేమ కనిపిస్తుంది. అక్కడ కూడా మోసం ఉండవచ్చు కాని మాకు అట్లాంటి అనుభవం కాలేదు. గంగానదిని చూస్తేనే పులకింత. ఈ ప్రపంచంలోని అందాలను, ప్రేమను దారి పొడుగునా పంచుకుంటూ, నిరర్థకమైన ఎందరి కీర్తినో తుడిచి పెట్టుకుంటూ నిత్యసుందరంగా కనిపిస్తుంది గంగ. అందుకే గంగలో స్నానమంటే ఎంతో ఇష్టం. మన పూర్వుల తేజస్సు అందుతున్నంత వికాసం. మన పురాణ పురుషులు, రుషులు, మహాత్ములు ఈ నదిలో స్నానం చేశారు కదా అనుకుంటాను.

శ్యామల పరీక్ష నించి దాదాపు ఓ అర్ధగంట ముందే వచ్చేసింది. మేము గదికి చేరుకునే సరికి నబనీత్ ఆ సందు మలుపులో ప్రత్యక్ష మయ్యాడు.

శ్యామల ముఖం మీది మబ్బు నబనీత్‌కి అర్థం కాలేదు. రాజాఘాట్‌లో మేము స్నానం చేస్తున్నపుడు నబనీత్ మా వెంబడే ఉన్నాడు. నది అవతల ఒడ్డున పడవలోకి ఇసుకను వీపున మోసుకుంటూ పోయే గాడిదలను, కాషాయం గుడ్డలతో, శరీరం మీద విభూతితో, జడలు కట్టిన జుత్తుతో, చేతిలో త్రిశూలంతో తిరిగే సాధువులను, నదిలో ఈత కొడుతున్న యువకులను చూస్తూ అంతసేపు నుంచున్నాడు.



దేవాలయాలన్నీ చూపి ఒంటిగంటకు తమ ఇంటికి మమ్మల్ని తీసుకు వెళ్లాడు నబనీత్. కాళ్లు కడుక్కోవటానికి నీళ్లు ఇచ్చేసరికి అర్థమయింది ఆయన పథకం. మమ్మల్ని ఇంతసేపు వెంబడించడం ఇందుకా? భోజనాలకు ఏర్పాట్లు. ఈశ్ వడ్డన. స్వీట్లు రొట్టెలు, పప్పు. కూరలు తీయగా, పచ్చడి తీయగా, ఉసిరిక్కాయ కూడా తీయగా. ప్లేట్లో మీగడ పెరుగు. దాంట్లో కూడా చక్కెర.

''అంతా తీపే. ఎట్లా తినేది?'' అని విసుక్కుంది శ్యామల.

శ్యామల అక్కడికి వచ్చేసరికి మూడ్ మారింది. పట్టుచీరల నేత మగ్గాలను చూస్తూ ఆ చీరల ధరలను అడిగి తెలుసుకుంది.

''తాగేనీళ్లను కూడా – ఓసారి నోట్లో పోసుకుని చూడు – అవి కూడా చినీ వేసే ఇచ్చాడేమో ఆయన''.

శ్యామలకు స్వీట్లు ఇష్టం ఉండదు. నేను అంతంతగానే. దక్షిణాది ఆహారపు అలవాట్లలో తీపి వంటకాలది కిందిచెయ్యే. పారేస్తే దక్షిణాది మనుషులు దుబారా అనుకుంటారేమో నన్న భయం ఒక పక్క పీకుతున్నది. ''ఇదేంటబ్బా – బలవంతం. తప్పకుండా తినాల్సిందేనా. డోకొస్తున్నది. వదిలేస్తా'' అని చెబుతున్నది శ్యామల.

మా భోజనాలు పూర్తయ్యే వేళకు నబనీత్ నాయనమ్మ వచ్చింది. మేము నమస్కరిస్తే బోసి నవ్వు నవ్వింది. వంద సంవత్సరాలు పెంచిన మొక్కకి పూచిన ఒకే ఒక పువ్వులాంటి అపురూపమైన నవ్వు. కొండ శిఖరాన్ని తెల్లటి మబ్బు తాకినట్టు ఆ నవ్వు చల్లగా గుండెను స్పృశించింది. ఆమె ఒంటిమీద కావి రంగు ముతక పట్టు చీర. నుదుట చందనం బొట్టు. మెడలో తులసి పూసల దండ. జుత్తు తెల్లగా పండి పలచబడిపోయింది. చర్మం ముడతలు పడిన చీరలా వేలాడుతున్నది.

అక్కడ నేర్చుకుంది శ్యామల 'నానీమా' అన్న మాట. మన నాయనమ్మ మాటకి ఎంతో దగ్గరి ధ్వని.

ఇప్పుడు నబనీత్ చిత్రాలు అర్థమయ్యాయి. నానీమా మమ్మల్ని దీవించింది. విశ్వనాథుడు మిమ్మల్ని చల్లగా చూస్తాడు, రక్షిస్తాడు, మీరు చిరకాలం సంతోషంగా జీవించండి. గంగామాయి ఆ మాటలు పలుకుతున్నట్టు అనిపించింది.

మర్నాడు సార్నాథ్ చేరుకునేసరికి మధ్యాహ్నం పన్నెండయింది. ఆకాశంలో తెల్లటి మబ్బులున్నాయి. పాదాల కింద తివాచీ లాగ పరుచుకున్న పచ్చటి మెత్తటి గడ్డి. ఎదురుగా శిథిల బౌద్ధ స్తూపం. అక్కడ సమీపంలో చెట్టు నీడన చతికిల పడ్డాను.

''ఇక్కడ కూచుని చూస్తేనే నాకు అందం. మీరు అట్లా తిరిగిరండి'' అన్నాను శ్యామలతో. ఉదయం నబనీత్ బెనారస్ యూనివర్శిటీలో తిప్పాడు. అక్కడ బిర్లా కట్టించిన నయీ బిశ్వనాథ్‌మందిర్ పారిశ్రామిక వేత్తల గెస్ట్ హౌజ్‌లా ఉందే తప్ప దేవాలయం అనిపించలేదు. అక్కడి దేవుడు తెల్లటి పరుపు మీద కూర్చున్న బొజ్జ వడ్డీ వ్యాపారిలా కనిపించాడు. పాత బిశ్వనాథ్ మందిర్‌లో కనిపించే నిరాకార నిరాడంబర సౌందర్యం ముగ్ధుల్ని చేస్తుంది. ఆ మందిరంలో భక్తులు గర్భగుడిలోకి వెళ్లి శివలింగాన్ని పూలతో స్వయంగా పూజించుకుంటారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటయిన ఆ జ్యోతిర్లింగాన్ని గంగాజలంతో అభిషేకం చేసుకుంటారు. ఈశ్వరుణ్ణి చూసినట్టే ఉంటుంది అక్కడ.

నబనీత్, శ్యామల మొత్తం తోటంతా తిరిగి వచ్చారు. అక్కడ కొత్తగా కట్టిన బౌద్ధమందిరం నచ్చలేదు. వేషం వేసినట్టు ఉంది. మందిరంలో బౌద్ధవిగ్రహం సిమెంట్ బొమ్మలా ఉందే తప్ప ఎలాంటి కళా సౌందర్యమూ లేదు. మొత్తానికి సార్నాథ్ చూసి నీరస పడిపోయాం. ఇక్కడికి రాక పోతే బావుండేది అనిపించింది నాకు.

శ్యామలకు ''అచ్ఛా హై'' అన్న మాట వచ్చింది. ప్రతిదానికీ నబనీత్‌ను ''అచ్ఛా హై అచ్ఛా హై'' అని కొన్నిసార్లు ప్రశ్నగాను, కొన్నిసార్లు సమాధానంగాను, కేవలం ఆ ఒక్క పదంలో హిందీ భాష మొత్తాన్ని హోమియో మందు లాగా కుదించింది. గడ్డిరేకు మొదలు చెట్టు ఆకు వరకు ప్రతీదీ కొత్తగా కనిపిస్తున్నది శ్యామలకు. చివరకు మొగలిరేకు చూసి ''ఆ తెల్లటి ముళ్ల క్రమ నిర్మాణం

లోని సౌందర్యం అపురూపం'' అని మెచ్చుకుంటున్నది.

సార్నాథ్‌లో లేళ్లను పెంచుతున్న తోట సైతం ఆరుబయలు జైలులా తోచింది. పిచ్చిగా శిక్ష అనుభవిస్తున్న దిక్కుల్లేని పిల్లల్లా అవి చూస్తున్నాయి.

పక్కనే కూర్చుని నబనీత్ గీస్తున్న బొమ్మల మీద రన్నింగ్ కామెంటరీ ఇస్తున్నది శ్యామల. నబనీత్ లేళ్ల దృశ్యాన్ని గీస్తున్నాడు. ఆ చిత్రాలు నా కోసమే. వచ్చేపోయే ఫారిన్ టూరిస్టులు, టిబెటిన్ బౌద్ధ భిక్షువులు అక్కడ నాకు ప్రత్యేక ఆకర్షణ. జపాన్, హాంగ్‌కాంగ్, కొరియా, బర్మా దేశాలకు చెందిన బౌద్ధ యాత్రికులు మరీ అందంగా కనిపించారు. సంప్రదాయ సిద్ధమైన వాళ్ల బౌద్ధ దుస్తులు ఎంతో నచ్చాయి.

కొంత సేపటికి ఆ టూరిస్ట్‌ల ఆకర్షణ కూడా చప్పబడిపోయింది. ఓ హిప్పీ అమ్మాయి నా దిశగా వచ్చి పక్కనించే పోయింది. దాదాపు పాతికేళ్ల వయసులో ఉన్న ఆ తెల్లజాతి అమ్మాయి మాసిన బట్టలతో, చెప్పులులేని పాదాలతో మొక్క మొక్కకూ, చెట్టు చెట్టుకూ పిచ్చి పిచ్చిగా తిరుగుతున్నది. చాలా రోజులుగా స్నానం చేసినట్టు లేదు. తిండీ, నిద్రా సరిగ్గా ఉన్నట్టు లేదు. ఈ దేశం వచ్చి ఈ అవస్థలు ఎందుకు కోరి తెచ్చుకుంటారో? ఆ ఆలోచనతోనే ఆ పచ్చిక మీద చిన్న నిద్ర పట్టింది నాకు.

మెలకువ వచ్చేసరికి నబనీత్ శిథిల బౌద్ధ స్తూపం బొమ్మ గీస్తున్నాడు. హిప్పీ అమ్మాయి ఆ బౌద్ధ స్తూపం తనదే అన్నట్టుగా దానికి ఆనుకుని కూర్చుని కీరా తింటున్నది.

బొమ్మలు గీస్తున్న నబనీత్‌ని తన ప్రశ్నలతో శ్యామల ఇబ్బంది పెడుతున్నది.

అదే సాయంత్రం దాదాపు నాలుగున్నర గంటల ప్రాంతంలో తిరిగి ముగ్గురం దశాశ్వమేథ్ ఘాట్ చేరుకున్నాము. నన్ను ఆ రోజు గంగానదిలో తిప్పుతానన్న పడవ పిల్లవాడి కోసం వెతికాను. వేరే పడవ వానితో నబనీత్ మాట్లాడాడు. మాకు మణికర్ణిక వేపు పోవడం ఇష్టం లేదు. దిగువ అశీనది సంగమం వరకు వెళ్లి తిరిగి రావాలని అనుకున్నాం. వేరొక పడవలో రాజస్థానీ పల్లె స్త్రీల జట్టు పల్లె పదాలు పాడుకుంటూ పోతున్నారు. ఆ పడవ పక్కనే పోతుంటే, ఆ సంగీతంతో మాకు బాగా కాలక్షేపం అయింది. గంగామాయికి పాటలు వినిపించాలని వచ్చినట్టున్నారు వాళ్లు. ఎన్నెన్ని పాటలు పాడారో!

మరుసటి రోజే ప్రయాణం. రేపు కుదరదు కాబట్టి ఈ సాయంత్రమే మార్కెటింగ్ పని ముగించేయాలనుకున్నాం. బెనారస్ చీరలు ఓ అరడజను వరకు కొన్నాం. స్నేహితులు కొందరు కొనుక్కు రమ్మని పైకం ఇచ్చారు. నబనీత్ తమకు తెలిసిన వర్తకుడి దగ్గర చీరలు కొనిపించాడు. సరసమైన ధరకే దొరికినట్టు అనిపించింది. బెనారస్ స్వీట్లు, బొమ్మలు, గంగా జలం రాగి చెంబులు, పాతనాణేలు కొనుక్కుని మేము నబనీత్‌తో ఆయన ఇంటికి చేరుకునే సరికి రాత్రి ఎనిమిదయింది.

ఆ రోజు బెనారస్ పర్యటనంతా ఒక ఎత్తు. ఆ రాత్రి నానీమా దగ్గర వీడ్కోలు తీసుకుని నబనీత్ బహూకరించిన పెయింటింగ్‌ని సంపాదించటం ఒక ఎత్తు.

నబనీత్ ఆ రాత్రి మా గదిలో మాకు వీడ్కోలు చెప్పి వెళ్లేసరికి రాత్రి పదయింది. అతనూ మాతో పాటే తిన్నాడు. శ్యామల కారపు దక్షిణాది పచ్చళ్లు పెట్టి, నబనీత్ మీద కసి తీర్చుకుంది. కళ్లల్లో నీళ్లు వస్తున్నా తింటూనే ఉన్న నబనీత్ దృశ్యం ఎంతకీ మరిచిపోలేక పోతున్నాను. ''నీవు మాకు స్వీట్లు పెట్టి ఏడిపించలే, తిను'' అని అంటున్నది.

డూన్ ఎక్స్‌ప్రెస్‌లో మా ఢిల్లీ ప్రయాణం. మా రైలు పదకొండు గంటలకు కనీసం ఓ అరగంట ముందన్నా స్టేషన్‌కి పోవాలి. గంగలో స్నానం చేసి అదృష్టం మళ్లీ ఎన్నాళ్లకో అని ఉదయం చాలాసేపు గంగానదిలో స్నానం చేశాం. శ్యామల స్నానం త్వరగానే ముగించుకొని నది అందాలను చూసుకుంటూ ఒడ్డున మెట్ల మీద కూర్చుంది. ఘాట్స్ మీద వ్యాయామం చేసుకునే యువకులు, నదిలో ఈత కొట్టి ఆడుకునే పిల్లలు, నదిలో పవిత్ర స్నానానికి వచ్చే అనేక జాతుల స్త్రీలు, పురుషులూ. బెనారస్ ఒక జాతికి, ఒక మతానికి, ఒక భాషకి, ఒక ప్రాంతానికి, ఒక దేశానికి పరిమితం కాకుండా ఇరుకు హద్దులను చెరిపేసి ఎదిగిన మహా పుణ్యక్షేత్రం అనిపిస్తుంది. ఆ మట్టి మీద ఒకసారి అడుగు పెట్టిన వాళ్లను ఆత్మపరమైన అందం జీవితాంతం ఆకర్షిస్తూనే ఉంటుంది. నానీమా అందుకే ఆ మట్టి మీదికి చేరుకుందేమో!

రైలు కదిలే వరకు నబనీత్ కోసం ఎదురు చూశాం. నబనీత్ స్టేషనుకు రాలేదు.

''వస్తానన్నాడే, ఎందుకు రాలేదో?'' అని నాలుగైదుసార్లు అనుకున్నాం.


రైలు కదిలిపోయింది. అయినా నబనీత్ కనిపించలేదు. రైలు వేగం పుంజుకుంది. ప్లాట్‌ఫారంకు దూరమై పోయింది. శ్యామల కళ్ల నించి అశ్రువులు రాల్తున్నాయి. గంగామాయి శ్యామలకు బెనారస్‌లో బహూకరించింది చివరికి ఈ అశ్రువులనేనా?

బెనారస్ వెళ్లి వచ్చిన వాళ్లలో భక్తులకు సైతం బిశ్వనాథ్‌మందిర్ కన్నా గంగానది నచ్చుతుంది. ఇంకొందరికి దశాశ్వమేథ్ ఘాట్ చిరస్మరణీయం. మరి కొందరికి ఆ బెనారస్ నగరమే అద్భుత సౌందర్యం. నాకు అక్కడి మొత్తం అందం నానీమాలో కనిపిస్తుంది. గంగానది, విశాలాక్షీ విశ్వనాథుడు, బెనారస్ పుణ్యక్షేత్ర మహత్యమూ – నానీమాలో నాకు కనిపిస్తాయి. నబనీత్ బొమ్మల్నే చూడకపోతే, ఈ కళాజగత్తు నా కళ్ల కందేనా?

***9-11-88***

*(ఆంధ్రప్రభ వార పత్రిక)*

చిరునామా
శ్రీపతి
బి -22, రవీంద్రనగర్, హబ్సిగూడ,
హైదరాబాద్ 500 007
సెల్ : 99594 25321



## దక్షిణాది టైమ్ సెన్స్ అంటే ఇష్టం!

దక్షిణాది భామ అసిన్ ఉత్తరాదిలో సృష్టిస్తున్న సంచలనం అందరికీ తెలిసిందే! హిందీ గజిని తరువాత ఆమె ఒక్కసారిగా తారాపథంలోకి దూసుకెళ్లింది. బాలీవుడ్ అగ్రహీరోలు అయిన సల్మాన్ ఖాన్, అజయ్ దేవగన్ నటిస్తున్న 'లండన్ డ్రీమ్స్'లో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఆ చిత్రం షూటింగ్ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉత్తరాది వారి కన్నా దక్షిణాది వారికే టైమ్ సెన్స్ ఎక్కువని కితాబిచ్చింది. ఏ సినిమానయినా వారు ప్లానింగ్ ప్రకారం పూర్తి చేస్తారని మెచ్చుకుంది. ఉత్తరాదిలో ఆ టైమ్ సెన్స్ కనపడదని చెప్పింది. 'గజినీ'లో అమీర్‌ఖాన్ తప్ప మిగతా వారందరూ దక్షిణాది వారే కావడంతో ఆ సినిమా అనుకున్న సమయానికి పూర్తి అయింది. అయితే 'లండన్ డ్రీమ్స్'లో మొత్తం ఉత్తరాది వారే కావడంతో టైమ్ తీసుకుంటోందంటూ ఉత్తరాదికి, దక్షిణాదికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బేరీజు వేసింది. అయితే దక్షిణాదిలో సినిమా జీవితాన్ని ఎంతగా ఎంజాయ్ చేసానో, ఉత్తరాదిన కూడా అంతే ఎంజాయ్ చేస్తున్నానని సంతోషాన్ని వ్యక్తం చేసింది.